కథా నిలయం
3693
శ్రీకాకుళం

# విప్లవవాది

నన్నేగాదు, శేషగిరి మామయ్య నెరిగున్న ఏ మనిషినైనా ఆశ్చర్య పరుస్తుంది ఆ వార్త. "శేషగిరి - జిల్లా యన్. జి. వో. అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నుకోబడ్డాడు." వార్తాపత్రికల్లో గూడా పడ్డది! చిన్నతనంనుంచీ పీనాసిగా, కన్సర్వేటివ్‌గా పేరుబడ్డ శేషగిరి: తన "బావిలో కప్ప జీవితానికి" మురిసిపోయి గర్వపడే శేషగిరి; న్యూసు పేపరు శీర్షికలనుచూచే సామాన్యమైన విద్యావంతుడి ఆత్రుతనుగూడా ఎన్నడూ కనబరచి ఎరగని శేషగిరి, నన్ను ముట్టుకోకు - అని బంధుమిత్ర వర్గాల నెప్పుడూ దరిజేరనీయని శేషగిరి - (తాలూకా ఆఫీసు గుమాస్తా, యన్.జి.వో. క్లాస్ III ఆఫీసర్ —)!!!

"విప్లవాభి వందనాలు" అని కార్డు వ్రాసిపడేశాను.

"ఒరే, నిన్నుచూసి చాలారోజులయింది. నీతో మాట్లాడాల్సినవి చాలా వున్నై. ఒకసారి యిలా రా" అని జవాబు వచ్చింది.

వెళ్ళలేకపోయాను. ఈ విప్లవ బీజాంకురాలు శేషగిరిలో ఎవరు రాల్చేరో నాకు తెలియనే లేదు. ఆ తరువాత నేను రాష్ట్రాంతరం వెళ్ళిపోయాను. దాంతో శేషగిరి మామయ్యను కలుసుకొనే అవకాశం బొత్తిగా పోయింది. కాని, ఒక రోజున పూనా ఆంధ్ర సంఘం గ్రంథాలయంలో పేపర్లు తిరగవేస్తుంటే శేషగిరి వ్రాసిన కథ ఒకటి ఒక తెలుగు వారపత్రికలో చూచాను. అది అతగాడి ఆత్మ కథ!

* * *

శేషగిరి పల్లెటూళ్ళో పుట్టాడు. చిన్న బస్తీలో హైస్కూలు చదువు పూర్తిచేశాడు. విద్యార్థి జీవితంలో అతనికి మామూలు ప్యాసుమార్కుల్ని మించి ఎప్పుడూ రాలేదు. హైస్కూల్లో అతను నేర్చుకున్నదల్లా - ఆడపిల్లల్ని ఏడిపించటం, సభల్లో తల కిందికి వాల్చి ఎరగనట్టుగా దొంగకేకలు వెయ్యటం, తెలుగు పండితులకు తడికెలు కట్టటం స్కూల్‌ఫైనల్ పాసై, కొత్తగా వెలిసిన టైపురైటింగు ఇన్‌స్టిట్యూట్‌లో చేరి లోవర్ పరీక్షకు కట్టాడు. అది తన్నింది.

తర్వాత పబ్లిక్ సర్వీసు కమీషన్‌లో సెలక్షను వచ్చింది. మొదట్లో కాపీయిస్టుగా వేశారు. శిరస్తాదారుకు లంచం చెల్లించి చివరకు గుమాస్తాగా వేయించుకొన్నాడు. అప్పట్నుంచీ దశతిరిగింది. బల్లకింద చేతులు పెట్టడం శ్రద్ధగా నేర్చుకొన్నాడు. తాసీల్దార్లు తిట్టినప్పుడు అతనికి కోపం రాలేదు. తాసీల్దారూ, పోలీసు ఇన్‌స్పెక్టరూ చేరి, రిమాండులో వున్న ఖైదీని కానిస్టేబిలు చంపిన నేరాన్ని కప్పిపుచ్చటం బాగా ఎరిగిగూడా అతని ఆత్మ చలించలేదు.

ఆ పిమ్మట పెళ్ళి. కట్నమంతా యివ్వలేదని కార్యం చేసుకోలేదు. ఇచ్చి, చేసుకొన్న తర్వాత, గడియారం యివ్వలేదని భార్యను యింటికి తీసుకురాలేదు. తీసుకువచ్చింతర్వాత అక్క మాటలు విని భార్యను అరడజను సార్లయినా కొట్టాడు. మరు సంవత్సరం ఆడపిల్ల పుట్టింది. మళ్ళీ ఆడపిల్ల. మళ్ళీ అంతే. మళ్ళీ. నలుగురాడపిల్లలు. పెద్దపిల్ల యీడేరింది. "సరైన" సంబంధం కుదరలేదు. ఇంతలో యుద్ధం వచ్చింది. ధరలు లేచినై. ఇల్లు దరిద్రమార్గంలో నడవసాగింది. మళ్ళీ దశ తిరిగింది.

యుద్ధం అయిపోయింతర్వాత, తిరిగి పాత ధర రూపాయికి 5 మానికల బియ్యం, మానెడు నెయ్యి; మూడు రూపాయలకి పెద్ద యిల్లు; 13 రూపాయలకి ఎడ్వర్డు నవర్సు, బల్లకింద ''గలగల'' వస్తాయని "అందరి" మాదిరిగానే ఆశించాడు.

కాని, రాలేదు. పెద్ద కూతురు గుండెమీద కుంపటి అయి కూచున్నది. లంచాలు దొరకటం అరుదయింది.

శేషగిరికి మొదటిసారి "ఆలోచనాశక్తి" కలిగింది. ...డ్డరోజులు అనుకొన్నాడు. జాతకాలు చూపించుకొన్నాడు. చేతులు చూపించుకొన్నాడు. అప్పుజేసి నవగ్రహ శాంతి చేయించుకొన్నాడు. పరిస్థితులు మామూలుగానే వున్నై - అన్ని జేసినా. పైపెచ్చు యింట్లో పచ్చడి మెతుకులవల్ల, కట్నం యిచ్చి కూతురు పెళ్ళిజేసే సమర్థత లేదనే దినదిన విచారంవల్ల ఓపిక చచ్చిపోసాగింది. ఆ సమయంలోనే ఒక విషాద సంఘటన శేషగిరిని కూకటివేళ్ళతో కదిల్చివేసింది. ఆఫీసు అటెండరు పాపయ్య క్షయరోగి అయిపోయిన భార్యకు మందిప్పించలేక ఆత్మహత్య చేసుకొన్నాడు. విషం తాగికాదు, రైలుకిందవడికాదు, బావిలో దూకికాదు - కిరసనాయిలుతో కాల్చుకుని.

తనొక్కడే యీ దురదృష్ట కర్మకు బలి అవుతున్నానని వాపోతున్న శేషగిరికి - తన చుట్టూ పనిచేసే అమాయకులందరూ తనవంటి దుర్భర పరిస్థితుల్లోనే గింజుకుంటున్నారని తెలియవచ్చింది. లోకాన్ని చూశాడు. కంట్రాక్టర్లు, డైరెక్టర్లు, వ్యాపారస్థులు, వడ్డీషాపు యజమానులు హాయిగా వున్నారు. గుమాస్తాలంతా చస్తున్నారు జీవితభారం మొయ్యలేక. (గుమాస్తాలొక్కరే సమాజంలోని పీడితవర్గం అని అతని అభిప్రాయం.) అన్యాయం అనుకొన్నాడు. పిరికిపిరికిగా కొందరితో చర్చించాడు. శాస్త్రితో ముఖ్యంగా. నాయుడుతో తర్వాత. ప్రమోషన్ వస్తుందని వేచివున్న నాయుడు అంతా విని - నువ్వు కమ్యూనిస్టువు లాగున్నావే- అనేశాడు. శేషగిరికి భయం వేసింది. మళ్ళీ మాట్లాడలేదు ఎవరితోనూ. ఇంతలోనే మద్రాసు అయ్యరొకాయన వచ్చి మీటింగు పెట్టి వుపన్యాసం యిచ్చాడు. ఆ రోజునే యన్.జి.వో. సంఘానికి నాందీవాక్యం పలికారు. అందరూ చందా కట్టిందాకా వుండి, శేషగిరి చందా కట్టాడు. అందరూ ఫారాలు పూర్తిచేయడం చూసి తనూ చేశాడు. 'సభ్యుణ్నైనాను' అని భయంతో సంతృప్తిపడ్డాడు.

కూతురుకు అడా పెట్టి పూలుకొని ఎరగని శేషగిరి, నెలజీతం రాగానే వున్న అప్పుల్ని ఖాతరు చేయక కొత్త పేపర్లు కొనటం సాగించాడు. లైబ్రరీలో చందాకట్ట యింటికి పుస్తకాలు తెచ్చుకొనేవాడు. చాడీలు చెప్పే తోడి గుమాస్తాల్ని ఝాడించి కడిగివేసేందుకు దమ్ములు సంపాదించుకొన్నాడు. ఫ్యానుచేత రాత్రి పదింటిదాకా దస్త్రాలు మోయించటం మానుకొన్నాడు. పెద్ద కూతుర్ని ట్రైనింగుకు పంపిద్దామనుకొంటున్నాడు. గుమాస్తా జీవితం మీద వారపత్రికల్లో ప్రచురణయ్యే కథలన్నీ శ్రద్ధగా చదవటం నేర్చుకొన్నాడు. ఒక్కోసారి ఆ రచయితలకు తలోకార్డు ముక్క వ్రాసేవాడు.

ఇష్టాయిష్టాలు ఏర్పరచుకొన్నాడు రచయితల్లో. చివరకు తాసీల్దారు (యన్. జి. వో. నే) తో పోటీకి నిలబడి జిల్లా కార్యదర్శి అయినాడు. వక్తగాక పోయినా సామాన్యంగా మాట్లాడగలడు. ఒప్పించగలడు. తన కంఠం రుద్ధమై పోయినప్పుడు, కళ్ళలో ఉద్రేకంతో నీళ్ళు నిలిచినప్పుడు అసలు విషయం విడిచినా, తిరిగి అందుకోగలడు.

సమ్మె వచ్చినప్పుడు అతడు వెనుకంజ వెయ్యాలని చూడలేదు. భగవంతుడి మీద నమ్మకం, భారం వేసి రంగంలోకి దిగాడు. మద్రాసు అయ్యరును ఆర్గనైజేషన్ బాగులేదని పబ్లీగా విమర్శించాడు. సమ్మె అయిపోయి

కక్షలు వచ్చిం తర్వాత నిజంగా అతనికి వక్తృత్వం అలవడింది. శిక్షను గురించి బెంగపడలేదు. (ప్రమోషన్ లేదు. ఇంక్రిమెంట్లు రావు.) తిరిగి మరు సంవత్సరం గూడా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైనాడు.

*   *   *

శేషగిరి మామయ్య ఆత్మకథ కట్టె - కొట్టె - తెచ్చె ధోరణి శైలిలో నడిచింది. కాని, పటుత్వం ఎక్కడా చావలేదు. జానపద చిత్రంలోని నాయకుడు ప్రేక్షకుల సానుభూతిని సరళంగా, సులభంగా సంపాదించిన పక్కీలోనే చదువరుల సానుభూతిని, ఉత్కంఠను- యన్. జి. వోల పాప్యులర్ హీరో గుత్తకు తీసుకొన్నాడు. కథా వస్తువును పఠితల ముందుంచటంలోనే మంచి టెక్నిక్‌ను అవలంబించాడు.

తన చిన్న, యిరుకు, స్వార్థప్రేరిత ప్రపంచపు ఎల్లల నుండి తప్పించుకొని, విశాలలోకంలోని మానవ సమస్యలను శాస్త్రీయ దృక్పథంతో అర్థం చేసుకొని కార్యరంగంలోకి దూకిన శేషగిరి ఆశావాదం హఠాత్తుగా వెనుకంజ వేస్తుంది. వర్గకలహం, సామ్యవాద వ్యవస్థదాకా వచ్చి నిలిచిన శేషగిరి విప్లవధోరణి మధ్యతరగతి కడలి చెలియలకట్ట వద్దనే సైకత శ్రేణుల్లో కలిసి పోతుంది. మొదటి భాగంలోని కథ ప్రామాణిక వాస్తవిక ధోరణిలో నడువగా, రెండవ భాగంలోనిది ఫాంటసీతో మిళితమైన ఫ్రెంచి యదార్థవాద కథావాఙ్మయ పంథాలో ముందుకు సాగింది.

*   *   *

ఈ విపరీతమైన మార్పుకు శేషగిరి చదివిన ఒక చిన్న కథ తాలిపీచిక. ఆ కథకుడు మారు పేరుతో వ్రాశాడు - చివర "శ్రీ" తగిలించుకొని.

ఆ కథలోని నాయకుడు పేరుపడ్డ ఒక కథకుడు. అతడు నిద్రలేచాడు (ఉదయం అయివుండాలి) చాలా ఆలస్యంగా. ఆ కిందటి రాత్రి అతను మరచి పోయి సోఫామీద పడుకొన్నాడు. (బహుశ ఆయన భార్యగూడా మర్చిపోయి వుండాలి). లేవగానే - ట్రేలో యాపిల్ ముక్కలు, నారింజ రసం, ఆమ్లెట్, కాఫీపాట్ కన్పించాయ్. టీపాయ్‌మీద సిగిరెట్టు టిన్ను వున్నది. అతను ఫలహారం సేవిస్తూ ఈజిప్షియన్ సిగార్ వెలిగించాడు. భార్యవచ్చి, చేతిలో ఒక ఉత్తరం వుంచుతుంది. (పాపం, చేతికి అందించదు.) రేపటిలోగా అతనో కథ వ్రాసి ఒక ప్రసిద్ధ పత్రిక జన్మదిన సంచికకు అంపాలి. అది రిమైండరు కార్డు.

"ఏంకథ వ్రాయను?" అని భార్యను ముద్దుగా అడిగాడు. (శేషగిరిని అప్పుడో అనుమానం పెనవేసుకొన్నది - వీడు నిద్రలేవగానే ఫలహారం సేవిం చాడే. ముఖం కడుక్కోలేదన్నమాట!)

"మొన్న గుమాస్తా ఒకాయన కారుకిందపడి కాలు విరగ్గొట్టుకొన్నాడే. ఆ తరువాతి పలితాల్ని వ్రాయండి" అంది ఆమె. (ఆమె జార్జెటు సిల్కు చీరెకట్టి వుండాలి అనుకొన్నాడు శేషగిరి.)

"ఛీ. నాన్సెన్సు ఏ పత్రికలో చూసినా యీ యన్. జివోగాళ్ళ గొడవే. ప్రపంచమంతా గొడ్డుబోయినట్టు చౌకబారు కథలూ, స్కెచ్చిలున్నూ, చాలా చీప్ ఫెలోస్-ఎంతసేపూ దరిద్రం, నరకం, కరువు భత్యం, పిల్ల పెళ్ళి; ఆఫీసరు దౌర్జన్యం నాన్సెన్సు."

(ఆ తరవాత ఆ కథకుడు ప్రస్తుతం అమెరికాలో చలామణీ అవుతున్న ఒక స్ట్రీమ్‌లైన్డు - Stream-lined - బిహేవియరిజం ధోరణిలో కథ వ్రాశాడు. దాంతో అతనికి పెద్దబహుమతి వచ్చి అమెరికాకు ఆహ్వానం వస్తుంది.)

శేషగిరి వళ్ళు పచ్చికారం మంటతో మండిపోయింది. మామూలుగా అయితే, ఇటువంటి గాలి కథల్ని లెక్కచేసేవాడు కాదు. చదివేవాడు కాదు. కథనిండా పైమెరుగు, బూటక వేదాంతం, పామర పదలాలిత్యం, బుర్రలేని నాగరికతకు బానిసైరవాడి గులాంగిరీ తొణికిసలాడుతున్నవి. శేషగిరి ఒక అభ్యుదయవాది. ఎందుకని ఈ కథను చదివి, పిచ్చి అహంకారం తెచ్చు కొన్నాడో అతనికే తెలియదు.

పత్రికాధిపతికి ఒక వుత్తరం వ్రాశాడు - (కార్డుముక్క) వాళ్ల కథకుడి పేరు బైటపెట్టలేదు. ఈ మాటు నీటుగా టైపుచేసి, కవరుమీద కేరాఫ్ అడ్రెసు వ్రాసి, కథకుణ్ణి అభినందిస్తూ మరొక లేఖను ఆ పత్రికాధిపతులకే అంపించాడు. వ్యక్తిగత స్వైరరిజాన్ని, వ్యష్టివిప్లవాన్ని వప్పుకోని శేషగిరి- ఈ కథకుణ్ణి చూసీ చూడటంతో నాలుగు చెప్పు దెబ్బలుకొట్టాలనే దృఢతర నిశ్చయానికి వచ్చాడు.

కాని, కథకుడి జవాబుకు యింకా నిరీక్షిస్తూనే వున్నాడు. అతని చిరు నామాకు ఎదురుచూస్తూనే వున్నాడు. ఈలోగా గుమాస్తాల సంఘం (దాని సాంస్కృతిక శాఖలో గూడా శేషగిరి యాక్టివ్ సభ్యుడు అనగా జీవం తొణికిస

లాడుతున్న మెంబరు) ఒక లిఖిత మాసపత్రిక నడపటానికి కమిటీని వేసింది. సంపాదకవర్గం ఎన్నికలకు పెద్ద కోలాహలం జరిగింది. గుమాస్తాల్లో (సమ్మె రోజుల్లో పెదిమలు విప్పని వీరులంతా) లిఖిత మాసపత్రికా సంపాదకుల ఎన్నికకు భారత రాజ్యాంగ చట్టంలోని పౌరహక్కులనుంచీ ఏకరువు పెట్టి హోరాహోరీ ప్రజాస్వామ్య యుద్ధం చేశారు. ప్రధాన సంపాదకుడుగా మెల్లకన్ను కృష్ణావతారం జెండా ఎత్తినాడు.

"ఎవరో ఆ క్రిష్ణావతారం?"

"ఓహో. కథలు వ్రాస్తాడండి. శేషగిరి మహాశయా!"

"ఏ పత్రికల్లో?"

"తెలుగు, అమెరికన్."

"భాష?"

"తెలుగు, అమెరికన్."

శేషగిరికి చిన్న మెదడులో విద్యుల్లతవలె మెరుపు మెరసింది. యాపిల్ ముక్కా, అమ్లెట్ తిన్నది వీడేనా? యన్. జి. వో.ల సంస్కృతిని దుయ్యబట్టిన బిహేవియరిస్టు వీడేనా? అయితే, తన పాదరక్ష ప్రహారాలు తినవలసింది వీడేనా?

క్రిష్ణావతారం ఆ జిల్లా రాజధానిలోనే ఇంకో ఆఫీసులో యన్. జి. వో. క్లబ్బులో చూస్తూనే వున్నాడుగాని అపరిచితమే.

"మీరేనా ఫలాని కథ వ్రాసింది?"

"నేనే! మీకెట్లా తెల్సిందీ? మారు పేరు పెట్టుకొన్నానే? బాగుంది గాదండీ? చాలా మంది అట్లా అన్నారండీ. నా స్టైయిల్ కనిపెట్టేశార్లెండి. అమెరికన్ టెక్నిక్!"

"అట్లాగా?"

"కాదంటారా?"

"అనను. నేను మూర్ఛపోయాను ఆ భావప్రభంజనావేగానికి నిలువలేక. అందే నమ్మండి. మీతో రాత్రికి మాట్లాడాలి క్లబ్బుమూసింతర్వాత యిద్దరం కలిసి వెళ్దాం" అన్నాడు శేషగిరి.

ర్లబ్బు మూసింతర్వాత బజార్లో అతన్ని నిలవేశాడు శేషగిరి.

"యస్.జి వోవి అయివుండి యిటువంటి రియాక్షనరీ కథలు వ్రాస్తావా?"

''అయితే, ఆ టెక్నిక్ మీకర్థం కాలేదన్నమాట!''

శేషగిరి వుడికిపోయాడు ఆ మాటకు.

''ఆ మాటంటే తంతా. జాగ్రత్త. పద. మీ యింటికివచ్చి, నీ ఆర్థికస్థితి చూచిగాని మళ్ళీ నీతో వాదించను'' అన్నాడు చాలాకోపం దిగమింగుకొన్న శేషగిరి.

శేషగిరి అన్నంత పనీ చేశాడు (తన్నలేదు). క్రిష్ణావతారం యింటికి ఆ పట్టు పట్టుగానే నడిచాడు. చిన్న పోర్షను. ముందు మున్సిపాల్టీ సెప్టిక్ టాంక్. ఇంట్లో బెడ్‌లైటు - లాంతరై వెలుగుతున్నది. చినిగిన చాప. దానిపక్క బియ్యం డబ్బా. గూట్లో కాయితాలు. (వీడు వ్రాసిన కథా సాహిత్యమే కాబోలు!) ఖరీదైన వస్తువుల్లా ఒక యిడ్డెన్లప్పాత్ర మాత్రమే క్రొంగొత్తది. ఆ కథకుడికి యిల్లాలున్నది. (ఆమెగూడా పెద్ద ఆరోగ్యంగా లేదు అనుకొన్నాడు శేషగిరి.)

"నీ బొంద. నీ ముఖమేనా యాపిల్ ముక్కలు తిన్నది? నీ భార్యకు తెల్సా నువ్వు ఆమ్లెట్లు తింటున్న సంగతి? నువ్వు సంఘ విద్రోహివి!'' శేషగిరి మెల్లకన్ను కథకుణ్ణి ఛడామడా తిట్టాడు. (ఎందుకో అర్థం కాలేదు క్రిష్ణావతారానికి )

మరుసటివారం పట్నం యస్.జి.వోల సర్వసభ్య సమావేశం జరిగింది. (అత్యవసర సమావేశం.) ఎజెండాలో కొందరి సభ్యులమీద శిక్షణ చర్య అని మాత్రమే వున్నది.

శేషగిరి మహోపన్యాసం చేశాడు సభలో. ఆర్థిక, సాంస్కృతిక పురోభివృద్ధులు రెంటికీ అవినాభావ సంబంధం వున్నదని నిరూపించాడు. ఆర్థిక సమానత్వం కోరే హక్కు సాంస్కృతిక సామ్యవాదాన్ని ఒప్పుకొనేవాళ్ళకే అన్నాడు. చాలా వుదాహరించాడు. పుస్తకాలు పైకెత్తి విదిలించి చూపాడు. (ఎవరికీ ఏమీ అర్థం కాలేదు. ఎందువల్లంటే, ఆ విషయంమీద ఎవరూ మాట్లాడలేదు.) చివరకు అసలు తీర్మానం వచ్చింది.

"సంఘ విద్రోహ రచనలు చేస్తున్న సభ్యుడు శ్రీక్రిష్ణావతాన్ని బహిష్కరించాలి.''

చాలామంది లేదారు. వేదికవద్దకు రాకుండానే మాట్లాడారు.

"వ్రాయటం అతని హక్కు."

"కావాల్సుంటే రాజ్యాంగం చూడు."

"నాలుగు హక్కుల్లో వ్రాత ఒకటి - చూసుకో."

"అసలు నీ తీర్మానాన్ని ఎవరూ బలపరచలేదు కనక చెల్లదు."

"పాయింట్ ఆఫ్ ఆర్డర్ తెస్తున్నా."

"మీటింగుకు పక్షంరోజులు నోటీసివ్వలేదు గనక నిబంధనల ప్రకారం చెల్లదు."

"మనకు నియంతృత్వం కాదు కావాల్సింది, డెమోక్రసీ."

"ఎస్‌సార్, ప్రజాస్వామ్యం!"

శేషగిరి ముగింపు వుపన్యాసం యివ్వలేదు. ఆ రోజునే యన్. జి వో. సంఘపు సామాన్య సభ్యత్వానికి గూడా రాజీనామా యిచ్చేశాడు కారణాలలో యివిగూడా వున్నై - "మధ్య తరగతి మనస్తత్వం నియంతృత్వం ఏదో, ప్రజాస్వామ్యం ఏదో తెలుసుకోలేదు. హక్కులు కాయితంమీద వుంటే చాలు- యీ పిచ్చిపుల్లాయిలకు. అన్ని విప్లవాల్నీ మోసంచేసే జాతి యిది."

* * *

శేషగిరి యిప్పుడు మధ్యతరగతి మానిసిగాడు.

అప్పర్ మిడిల్ క్లాస్ ఆద్మీ. అతనింట్లో ముగ్గురి సంపాదన. (పెద్ద కూతుర్లిద్దరూ టీచర్లు.) శేషగిరి తిరిగి సమ్మె చెయ్యలేదు.

(తెలుగు స్వతంత్ర - 19 ఆగష్టు 1955)